ఈనాడు సిద్దిపేట

ఆదివారం అక్టోబరు 20, 2024

13

ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు చర్యలు: కలెక్టర్



అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ మను చౌదరి

నంగునూరు: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందుకు నర్మేటలో రూ.300 కోట్లతో 65 ఎకరాల విస్తీర్ణంలో కర్మాగార నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం మండల పరిధి నర్మేటలోని ఆయిల్‌పామ్ కార్మాగారంలో సిద్దిపేట నియోజకవర్గ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సుబ్బారావు, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఆయిల్‌పామ్ సాగు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులు స్పందిస్తూ.. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడంలేదని, అడవి పందుల బెడద తీవ్రంగా ఉందని, రాయితీలు, అంతర పంటల సాగు డబ్బులు రావడంలేదని కలెక్టర్‌కు వివరించారు. అవగాహన సదస్సు నిర్వహిస్తే కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం ఆందోళన కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారిణి సువర్ణ, వ్యవసాయశాఖ అధికారిణి రాధిక, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



నర్మేటలో భారాస, కాంగ్రెస్ నాయకులను అదుపు చేస్తున్న పోలీసులు

రైతులను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రికి సమాచారం ఇవ్వకుండా స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు సదస్సుకు ఎలా హాజరవుతారని నర్మేట గ్రామపంచాయతీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సమావేశానికి ముందు ఆందోళనకు దిగారు. హరీశ్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమావేశానికి వెళ్లే రైతులను అడ్డుకున్నారు. దీంతో భారాస, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఏసీపీ మధు, సీఐ శ్రీను పోలీసు సిబ్బందితో కలిసి రెండు వర్గాలకు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఇక్కడ సైనికులకు అన్నీ ఉచితమే!

న్యూస్‌టుడే, కోహీర్

కని పెంచిన తల్లిదండ్రులకు, ఉన్న ఊరికి దూరంగా.. దేశ సరిహద్దుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి కాపలా కాస్తూ మనల్ని రక్షిస్తుంటారు సైనికులు. వారి సాహసం, త్యాగం వెలకట్టలేనివి. ఎక్కడైనా కనిపిస్తే మన మనసు ఉప్పొంగుతుంది. వారికి సెల్యూట్ చేస్తుంటాం. దేశానికి ఇంతగా చేస్తున్న సైన్యం అంటే ఆ కుటుంబానికి ప్రాణం. తమ ఫలహారశాలలో సైనికులకు అన్నింటినీ ఉచితంగా అందిస్తుండటం విశేషం. వారే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ సమీపంలోని హోటల్ నిర్వాహకులు సానం వాసుదేవ్ కుటుంబసభ్యులు.

ఈ చిత్రం చూడగానే.. ఇదేదో సాధారణ హోటలే కదా.. ఏముంది విశేషం అనిస్తుంది కదూ! దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. ఇక్కడికి సైనికులెవరైనా వస్తే అన్నింటినీ ఉచితంగా అందించడమే ఆ ప్రత్యేకత.





వాసుదేవ్‌తో వైమానిక దళం సిబ్బంది

చిన్నతనంలోనే..

ఇదే జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లికి చెందిన సానం జగన్నాథం, శాంతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు వాసుదేవ్, గోవింద్, వెంకటేశం, కుమార్తె పార్వతమ్మ ఉన్నారు. జగన్నాథం కోహీర్ మండలం కొత్తూర్(డి) సమీపంలో 9వ నంబరు జాతీయ రహదారి (ప్రస్తుత ఎన్‌హెచ్ 65)లో టీ హోటల్ నడిపేవారు. పెద్ద కుమారుడు వాసుదేవ్ 1986లో ఏడో తరగతి పాసయ్యాడు. అప్పట్లో తనకిష్టమైన ఆర్మీ జవాను ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీనికి ఇష్టపడని అతడి తల్లిదండ్రులు వాంగ్మూల పత్రంపై సంతకం చేయలేదు. వాసుదేవ్ నిర్ణయం మార్చుకొని పదేళ్లు హైదరాబాద్ సమీపంలో పండ్ల వ్యాపారం చేశారు. ఆ తర్వాత పలు కారణాలతో తిరిగొచ్చేసి హోటల్ నడిపిస్తున్నారు.

కుమారుడినైనా..

వాసుదేవ్‌కు వెంకటమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. ముగ్గురు కుమార్తెలు. కుమారుల్లో ఒకరు ఆర్మీలో చేరాలని వాసుదేవ్ ఆశించారు. పెద్ద కుమారుడు నారాయణ సరిపడా ఎత్తు లేక విఫలమయ్యారు.

ప్రత్యేకంగా స్వాగతం

8 ఏళ్ల కిందట వాసుదేవ్ తన హోటల్‌ను దిగ్వాల్ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కకు మార్చారు. 65వ నంబరు జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. తమ హోటల్‌కు వచ్చే సైనికులకు ఆహారం ఉచితంగా అందించాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు సైనికుల వాహనాలు వెళ్తూ తమ హోటల్ దగ్గర ఆగగానే ప్రత్యేకంగా స్వాగతం పలుకుతారు. జవాన్లు తీసుకునే అల్పాహారానికి, ఛాయ్, ఇతర వస్తువులకు ఎలాంటి డబ్బు తీసుకోకుండా ఉచితంగా ఇచ్చేస్తారు వాసుదేవ్. వీరి సేవలను గుర్తించిన ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం 2019లో సత్కరించారు.



వాసుదేవ్ కుమారుడిని సన్మానిస్తున్న కోదండరాం

నిజమైన హీరోలు వారే..: వాసుదేవ్

తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న సైన్యమే నిజమైన హీరోలు. నా జీవిత లక్ష్యం నెరవేరకున్నా ఆర్మీ జవాన్లకు నా వంతుగా సేవ చేస్తున్నా. నేటి యువత ధృడంగా ఉండి మాతృభూమి సేవలో మమేకమవ్వాలన్నదే నా అభిప్రాయం.

'సీఎం మాట నిలుపుకోవాలి'



హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ ప్రాంతాన్ని పూర్వపు కరీంనగర్ జిల్లాలో కలపాలనే డిమాండ్ పెరుగుతోంది. ఈ మేరకు హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో 'ఈ చౌరస్తా సాక్షిగా' అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది. 'మన ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలుపుకోవాలే... హుస్నాబాద్ ప్రాంతాన్ని కరీంనగర్ జిల్లాలో కలపాలే..' అని పేర్కొంటే బార్ అసోసియేషన్ పేరిట ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇదే విధంగా మల్లెచెట్టు చౌరస్తాలోనూ ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం పీసీసీ అధ్యక్షుడిగా సీఎం రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ ప్రాంతంలో భారత్ జోడో యాత్రకు మద్దతుగా పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. తమ పార్టీ అధికారంలోకి వస్తే సిద్దిపేటలో చేర్చిన మండలాలను కరీంనగర్ జిల్లాలో చేర్చుతామని ప్రకటించారు. దానిని గుర్తు చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

విద్యార్థులపై శ్రద్ధ అవసరం

దౌల్తాబాద్: ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చదివించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం బాసిత్ పాల్గొన్నారు.

ఆకునూరు కార్యదర్శి సస్పెన్షన్

చేర్యాల, న్యూస్‌టుడే: మండలంలోని మేజరు పంచాయతీ ఆకునూరు కార్యదర్శి పులి బాలయ్య సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ తెలిపారు. గ్రామంలో ఓ ఇంటి నిర్మాణం విషయమై బాలయ్య పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వాటిపై విచారణ చేసిన జిల్లాస్థాయి అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా కార్యదర్శిపై చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

ప్రకృతి చిత్రం గీసినట్లు..



పచ్చని ప్రకృతిలో పక్షులు ఎగురుతున్నట్లు గీసిన చిత్రంగా ఉంది కదూ.. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం ధర్మారంలోని మల్లన్న చెరువులో పెద్ద సంఖ్యలో నల్ల కొంగలు శనివారం ఇలా దర్శనమిచ్చాయి. చెరువు పరిసరాల్లోని నీటి మడుగులో ఆహార వేటలో నిమగ్నమయ్యాయి. పొలాల్లో ఎక్కడ చూసినా తెల్ల కొంగల గుంపు కనిపిస్తుంటాయి. వందల సంఖ్యలో ఒకేచోట నల్ల కొంగలు గుంపుగా కనిపించడం చాలా అరుదని గ్రామస్థులు అంటున్నారు. పరిసరాల్లో ధర్మారం అడవి ఉండటంతో పెద్ద సంఖ్యలో ఇవి తరలివచ్చాయని వారు తెలిపారు. -న్యూస్‌టుడే, జగదేవపూర్

బోనస్‌ను బోగస్ చేసిన ప్రభుత్వం: హరీశ్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి.. గెలిచాక సన్నరకాలకు మాత్రమే ఇస్తామనటం ఎంతవరకు సమంజసమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సన్నాలను మార్కెట్‌లో అమ్మితేనే బోనస్ ఇస్తాం.. బాయి కాడ అమ్మితే ఇవ్వమనటం ఏంటని ప్రశ్నించారు. బోనస్‌ను ఈ ప్రభుత్వం పూర్తిగా బోగస్ చేసిందన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. మొక్కజొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలు కూడా వెంటనే ప్రారంభించాలని కోరారు. గత రెండు సీజన్లలో వడ్ల కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన వారికి కమీషన్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, తమ ప్రభుత్వ హయాంలో 11 సార్లు రూ.72వేల కోట్లు రైతుబంధు ఇచ్చామని, కానీ ఈ ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఉన్న రూ.పదివేలు కూడా ఇవ్వటం లేదని వాపోయారు. విద్యుత్తు సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారిణి తనూజ, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ నల్ల నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాల సాయిరాం, బల్దియా మాజీ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట పత్తిమార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

పూర్తిస్థాయిలో కేంద్రాలు ప్రారంభించాలి

సిద్దిపేట: నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సహకార సంఘాల ఛైర్మన్లు, అధికారులతో శనివారం సిద్దిపేటలో సమీక్ష నిర్వహించారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా చూడాలని, చరవాణి ద్వారా సూచించారు. అంతకుముందు పట్టణంలోని 148 మంది లబ్ధిదారులకు రూ.32.92 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

గ్రామీణ క్రీడాకారులను వెలికితీయాలి



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. జిల్లాలోని 26 మండలాల నుంచి అండర్-14, 17 బాలబాలికలు సుమారు 2500 మంది పాల్గొన్నారు. రెండోరోజు శనివారం ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, హెచ్‌ఎం విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ రెడ్డి, వ్యాయమోపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి, తోట సతీష్, ఉప్పలయ్య, వెంకటస్వామిగౌడ్, అశోక్, శ్రీనివాస్, సుజాత, మురళీధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: అండర్-14 వాలీబాల్ బాలికల విభాగంలో గజ్వేల్(ప్రథమ), నంగునూరు(ద్వితీయ), కొండపాక (తృతీయ), అండర్-17 బాలికల విభాగంలో గజ్వేల్(ప్రథమ), చేర్యాల(ద్వితీయ), జగదేవపూర్(తృతీయ), అండర్-14 ఖోఖో బాలుర విభాగంలో సిద్దిపేట రూరల్(ప్రథమ), నారాయణరావుపేట(ద్వితీయ), మిరుదొడ్డి(తృతీయ), అండర్-17 బాలుర విభాగంలో వర్గల్(ప్రథమ), కొండపాక(ద్వితీయ), నారాయణరావు పేట(తృతీయ), అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో చిన్నకోడూరు(ప్రథమ), కొండపాక(ద్వితీయ), నారాయణరావు పేట(తృతీయ) స్థానాల్లో నిలిచాయి.

యాసంగికి తప్పని గోస

అసంపూర్తిగా పంట కాలువలు

న్యూస్‌టుడే- చేగుంట, మిరుదొడ్డి, దుబ్బాక

గోదావరి నీటిని చెరువుల్లోకి మళ్లించాలన్న నీటిపారుదల శాఖ లక్ష్యం నెరవేరడం లేదు. దీంతో ఏటా ఆయకట్టు రైతులకు సాగు నీటికి కటకట తప్పడం లేదు. యాసంగి సీజన్‌కు అన్నదాత సిద్ధమవుతున్నా.. సాగునీరందించే పంట కాలువలు మాత్రం అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ జలాశయాల ప్రధాన కాలువల నుంచి మిరుదొడ్డి, దుబ్బాక, దౌల్తాబాద్, రాయపోల్, తొగుట, చేగుంట, నార్సింగి, చిన్న శంకరంపేట, రామాయంపేట మండలాల్లోని చెరువుల్లో గోదావరి నీటిని నింపడానికి నిర్మిస్తున్న ఉప కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో 40వేల ఎకరాలకుపైగా సాగు చేసేందుకు సమాయత్తమవుతున్న అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



చేగుంట: పూర్తవని కొండపోచమ్మ సాగర్ కాలువ

చెరువులు నింపేందుకు..

మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ 12, 13వ ప్యాకేజీల ద్వారా దుబ్బాక, మెదక్ నియోజకవర్గాల్లోని రైతులకు సాగునీరు అందించే ఉపకాలువ పనులు అర్ధాంతరంగా నిలిచాయి. నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదు. మల్లన్నసాగర్ కాలువకు సంబంధించి నాలుగేళ్ల కిందట దుబ్బాక మండలంలోని బల్వంతాపూర్ నుంచి చెల్లాపూర్, మల్లాయపల్లి, కుమ్మర్‌పల్లి, పోతారం, అచ్చుమాయిపల్లి, గంభీర్‌పూర్ వరకు 30,826 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 14.5 కి.మీ.మేర 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మించడానికి నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఉప కాలువ పనులను 7.8 కి.మీ.మేర మాత్రమే చేశారు. 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువ పనుల్లో భాగంగా ఆరు చోట్ల డబుల్ లైన్ రోడ్ బ్రిడ్జి(డీఎల్ఆర్బీ), 7 చోట్ల సింగిల్ లైన్ రోడ్ బ్రిడ్జి(ఎస్ఎల్ఆర్బీ) నిర్మించారు. చెల్లాపూర్, మల్లాయపల్లి, కమ్మర్‌పల్లి మధ్య కాలువ పనులు కొన్నిచోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు కేవలం రూ.4- 4.5 లక్షలు మాత్రమే ఇస్తుండడంతో కొందరు చెక్కులు నిరాకరిస్తున్నారు. దీంతో కమ్మర్‌పల్లి, పోతారం మధ్య 3.5 కి.మీ. కాలువ పనులు పెండింగులోనే ఉన్నాయి. దౌల్తాబాద్ మండలంలో దొమ్మాట, గాజులపల్లిలోని బొమ్మ చెరువు, పెద్ద చెరువు, పటేల్ చెరువు, కనక చెరువు, కోమటి చెరువు, దాచారం కుంట, తుమ్మ చెరువుల్లో గోదావరి నీటిని నింపడానికి నిర్మించతలపెట్టిన ఉపకాల్వల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి మండలాల్లో కొండాపూర్, ధర్మారం, జంగపల్లి, వీరారెడ్డిపల్లి, అల్మాస్‌పూర్ చెరువులు నింపడానికి నిర్మించతలపెట్టిన ఉప కాలువలు అసంపూర్తిగా మారాయి.

గొల్లపల్లి వరకే సాగునీరు

- చేగుంట మండలం గొల్లపల్లి, రాంపూర్, కరీంనగర్, రుక్మాపూర్, చిట్టోజిపల్లి, భీంరావుపల్లి, రెడ్డిపల్లి, వల్లూరు మీదుగా చిన్న శంకరంపేట చెరువుల్లో నీరు నింపడానికి చిన్నశంకరంపేట కెనాల్ ద్వారా 55 కి.మీ.మేర ఉప కాలువల పనులు చేపట్టారు. రాంపూర్ శివారులోని చెరువు భూగర్భం నుంచి గోదారి నీటిని సరఫరా చేయడంతో గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. దీంతో కేవలం గొల్లపల్లి వరకు మాత్రమే ఉప కాలువల ద్వారా సాగునీరు వెళుతోంది. రాయపోల్ మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, సయ్యద్‌నగర్ చెరువులను నింపటానికి 10 కి.మీ.మేర ఉపకాలువల నిర్మాణానికిగాను 7 కి.మీ. మాత్రమే పనులు పూర్తయ్యాయి. తొగుట మండలం తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేట, ఘనపూర్‌లో ఉపకాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి దోహదం



ఆరోగ్య సిబ్బందికి రిజిస్టర్లు అందజేస్తున్న జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట: చిన్నారులకు శతశాతం వ్యాధినిరోధక టీకాలు అందించడం సహా తల్లీబిడ్డల ఆరోగ్యం, సంక్షేమానికి ఫీల్డ్ రిజిస్టర్ దోహదం చేస్తుందని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఆశా ఫీల్డ్ సర్వీస్ రిజిస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. రిజిస్టర్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలతో పాటు అనారోగ్య సమస్యలను నమోదు చేయవచ్చన్నారు. ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి ఆనంద్, ప్రతినిధులు రేవతి, శ్రీనివాస్, శ్రీకాంత్, మాణిక్యమ్మ, నవీన్‌రాజ్‌కుమార్ ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

నిర్వాసితుల సమస్యలపై చర్చించాలి



కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

ములుగు, గజ్వేల్: మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితుల సమస్యలపై చర్చించేందుకు మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఆర్అండ్ఆర్ కాలనీకి ఎప్పుడు వస్తారో చెబితే.. అదే సమయానికి సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తామని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. శనివారం ములుగు మండలం వంటిమామిడి, గజ్వేల్ మండలం అక్కారంలో ఆయన మాట్లాడారు. జలాశయాల నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన భూనిర్వాసితులకు భారాస ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదన్నారు. మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణను కేసీఆర్ కుటుంబం అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు భారాస కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్ ఖాన్, నేతలు భాస్కర్, యాదగిరి, బోస్, తమ్మలి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, కరుణాకర్ గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు రూ.77.20కోట్లు

నాలుగు వరుసలుగా హుస్నాబాద్-కొత్తపల్లి రహదారి

న్యూస్‌టుడే, హుస్నాబాద్: హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే రహదారిలో కొత్తపల్లి(రాజీవ్ రహదారి) వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరణకు మోక్షం లభించింది. మొదటి దశగా ఈ రహదారి అభివృద్ధికి రూ.77.20 కోట్లు మంజూరు చేస్తూ రహదారులు, భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జీవో జారీ చేశారు.



హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే రెండు వరుసల రహదారి


కేంద్రానికి ప్రతిపాదన పంపినా..

గత మూడేళ్లుగా కొత్తపల్లి-హుస్నాబాద్-జనగాం జాతీయ రహదారిని అభివృద్ధిపరచాలనే డిమాండ్ ఉంది. కరీంనగర్-హుస్నాబాద్-జనగాం మీదుగా యాదగిరిగుట్ట, సూర్యాపేట, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు కరీంనగర్ వైపు మంచిర్యాల, గోదావరిఖని, జగిత్యాల ప్రాంతాలకు వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఇలాంటి రహదారిని భారత్‌మాల పథకం కింద జాతీయ రహదారిగా అభివృద్ధికి మూడేళ్ల క్రితం ప్రతిపాదించినా అమలుకు నోచుకోలేదు. ఈ ఏడాది మరోసారి కేంద్రానికి ప్రతిపాదన పంపించారు.

రవాణా సౌకర్యం మెరుగు..

రాష్ట్ర రహదారిగా అభివృద్ధి పరుస్తామని హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో ముందుగా కరీంనగర్(కొత్తపల్లి)-హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. ఈమేరకు మొదటి దఫాగా ఎండీఆర్ ప్లాన్ కింద ప్యాకేజీ-2లో రహదారిలో 11కి.మీ నుంచి 21కి.మీ వరకు నాలుగు వరుసలుగా నిర్మాణానికి రూ.77.20కోట్లు పరిపాలన మంజూరు అయ్యాయి. ఈ రహదారి అభివృద్ధి జరిగితే హుస్నాబాద్ నుంచి కరీంనగర్ రవాణా సౌకర్యాలు మరింత మెరుగవుతాయి. హుస్నాబాద్, కోహెడతో పాటు జనగాం, హనుమకొండ జిల్లాల నుంచి వచ్చే వారికి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. దశాబ్ద కాలంగా ఇబ్బందులకు గురవుతున్న ఈ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

'బలగం' నటి కొమురమ్మకు స్పీకర్ రూ.లక్ష ఆర్థిక సాయం



వికారాబాద్, న్యూస్‌టుడే: 'బలగం' సినిమాలో నటించిన కొమురమ్మకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తన వేతనం నుంచి రూ.లక్ష విరాళం హైదరాబాద్‌లోని అధికార నివాసంలో శనివారం అందించారు. దయనీయంగా ఉన్న కొమురమ్మ, మొగిలయ్యలు ఇటీవల ఓ సభలో స్పీకర్‌ను కలిసి ఆర్థిక ఇబ్బందుల గురించి వివరించారు. వెంటనే ఆయన రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకున్నారు.

క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు రేపు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక ఉంటుందని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1, 2001 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో.. సాంకేతికత

న్యూస్‌టుడే, మెదక్

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికీ అత్యధికులకు వ్యవసాయమే జీవనాధారం. నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో వరి ఎక్కువగా సాగవుతోంది. ఈ మేరకు ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగాలు సన్నద్ధమయ్యాయి. కోతలు షురూ కావడంతో కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రభుత్వం సన్న రకం సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగా సన్నాలను గుర్తించేందుకు ఈ సీజన్‌లో సాంకేతికతను వినియోగించనుండటం విశేషం.

నాలుగు జిల్లాల్లో ఇలా..

	ధాన్యం దిగుబడి (లక్షల మె.టన్నుల్లో..)	కొనుగోలు కేంద్రాలు
మెదక్	7.49	483
సంగారెడ్డి	3.18	211
సిద్దిపేట	9.0	417
వికారాబాద్	1.0	107

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 8,99,369 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్నాల సాగే ఎక్కువగా ఉంది. కొందరు దొడ్డు రకం సైతం పండించారు. ఈ క్రమంలో ధాన్యం సేకరణకు అవసరమయ్యే కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు. సన్నరకాలు, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం 33 రకాలను సన్నాలుగా గుర్తించింది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆయా పరికరాల వినియోగంపై వివిధ జిల్లాల్లో వ్యవసాయ, సహకార, జిల్లా గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు.

సన్నాలు గుర్తించేలా..

సన్న రకానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో వీటి సేకరణలో అవకతవకలు జరగకుండా పక్కాగా చర్యలు చేపట్టారు. నాణ్యతతో పాటు సన్న ధాన్యం గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్లు)ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్రానికి రెండు డిజిటల్ పరికరాలు చొప్పున కేటాయిస్తున్నారు. ఈ యంత్రంలో గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మి.మీ. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ. కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. నిర్దేశిత ప్రమాణాలు ఉంటేనే కొంటారు. సంచుల్లో ధాన్యాన్ని నింపాక సులువుగా గుర్తించేలా సన్నాలకు ఎరుపు, దొడ్డు రకానికి ఆకుపచ్చ దారంతో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.



వడ్లు ఒలిచేందుకు..

సన్నాలను గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ పరికరంలో వడ్లను ఒలిచి బియ్యాన్ని మాత్రమే వేయాల్సి ఉంటుంది. ఇందుకు కొంత శ్రమ అవసరం. సులభంగా వడ్లు ఒలిచేందుకు ప్యాడీ హస్కర్ యంత్రాన్ని అందిస్తున్నారు. ఇందులోకి కొంత ధాన్యాన్ని వేసి తిప్పితే వడ్ల పొట్టు తొలగిపోయి బియ్యంగా మారుతాయి. వాటిలో నుంచి ఓ గింజను గ్రెయిన్ కాలిపర్‌లో వేసి సరిపోలుస్తారు.



ధ్రువీకరించాకే..:



సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. సన్నాలను కొత్త పరికరం ద్వారా గుర్తించి వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. దళారుల ప్రమేయం తగ్గించడానికి ఐరిస్ విధానం దోహదపడుతుంది. ఆయా వాటిపై అధికారులకు శిక్షణ ఇచ్చాం. పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. **హరికృష్ణ, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, మెదక్**

పక్కదారి పట్టకుండా..



రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని, వాటిని కొనుగోలు కేంద్రాల్లో భారీగా విక్రయిస్తుంటారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు కేంద్రానికి వచ్చే వారి వివరాలను నిర్వాహకులు నమోదు చేసి, చరవాణికి ఓటీపీ పంపించేవారు. ధాన్యం విక్రయం సమయంలో మరోసారి ఓటీపీ పంపి ట్రక్‌షీట్ మిల్లులకు పంపేవారు. ఈసారి ముందుగా రైతు వివరాలు నమోదు చేసుకొని ఓటీపీ పంపి, విక్రయ సమయంలో ఐరిస్ వినియోగిస్తారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఆటల్లో గెలుపోటములు సహజమని, వాటి ద్వారా మానసిక, శారీరక దృఢత్వం చేకూరుతుందని మెదక్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి (డీవైఎస్‌వో) దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ మైదానంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియా ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్), సౌత్ఇండియా ఫుట్‌బాల్ అకాడమీ (ఎస్‌సీఎఫ్ఏ) సంయుక్తంగా చేపట్టిన ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలతో పాటు చదువుల్లో రాణిస్తే పలు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ అవకాశాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల నిర్వాహకులు విష్ణుతేజ మాట్లాడారు. అండర్-13, 15, 17 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు కొనసాగాయి. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి మొత్తం 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రవేశానికి నిర్వాహకులు తెలిపారు. ఐకేఎఫ్ స్కౌట్ వినోద్ కుమార్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగరాజు, శిక్షకులు ప్రకాశ్, భాగ్యమ్మ, ప్రశాంత్, వినయ్, ధను తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హాకీ జట్ల ఎంపికలు



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల హాకీ అండర్- 14, 17 ఎంపికలు కంది ఐఐటీహెచ్‌లోని డీపీవీ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అన్నదాత ప్రాణాలు తీసిన ఇనుప కంచె



యాదయ్య

వెల్దుర్తి: అడవి పందుల నుంచి రక్షణకు పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్తు సరఫరా అవుతున్న ఇనుప తీగలకు తగిలి రైతు మృతిచెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని యశ్వంతరావుపేటకు చెందిన గుండెని యాదయ్య(46) పొలం అటవీ ప్రాంతానికి దగ్గర్లో ఉంది. అడవి పందుల బారి నుంచి రక్షణగా పొలం చుట్టూ ఇనుప కంచె బిగించాడు. శుక్రవారం రాత్రి యాదయ్య భోజనం చేసి పంట కాపలాకు పొలానికి వెళ్లాడు. కంచెకు విద్యుత్తు సరఫరా కల్పించి నిద్రించాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన చుట్టుపక్కల రైతులు గమనించగా.. ఇనుప కంచె తగిలి యాదయ్య మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. శనివారం యాదయ్య భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చేపలు పట్టడానికి వెళ్లి మృత్యువాత



శ్రీనివాస్

నార్సింగి(చేగుంట): చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వల చుట్టుకొని నీట మునిగి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాలు.. నార్సింగి మండలం నర్సంపల్లికి చెందిన ఉడుత శ్రీనివాస్ (50) వ్యవసాయం చేస్తుంటాడు. స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వలలు వేశాడు. శనివారం ఉదయం వెళ్లగా వెళ్లి ప్రమాదవశాత్తు వల చిక్కుకొని నీట మునిగి మృతిచెందాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. శ్రీనివాస్‌కు భార్య, కుమార్తె, కుమారుడున్నారు. కేసు నమోదైంది.


ట్రాక్టర్ బోల్తా పడి మహిళ దుర్మరణం



సాయమ్మ

కౌడిపల్లి: ట్రాక్టర్ బోల్తాపడి మహిళ దుర్మరణం పాలైంది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధి భుజరంపేట పరిధి వెంకటాపూర్‌కు చెందిన బడిగంటి సాయమ్మ(54). శనివారం ఇంటి నిర్మాణానికి కౌడిపల్లి నుంచి ట్రాక్టర్లో డస్ట్ తీసుకెళుతుండగా.. శివారులోని కూకుట్లపల్లి రోడ్డుపై మల్లుకుంట శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ ట్రాలీపై కూర్చున్న సాయమ్మ డస్ట్‌లో కూరుకుపోయి చనిపోయింది. డ్రైవర్ యాదాగౌడ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

వాహనం ఢీకొని వృద్ధుడు..



నారాయణ

మిరుదొడ్డి: వాహనం అదుపుతప్పి వృద్ధుడిని ఢీకొట్టడంతో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా భూంపల్లి ఎస్సై హరీశ్ తెలిపిన వివరాలు.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లికి చెందిన పర్స నారాయణ(66) రహదారి పై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో డీసీఎం వాహనం అతివేగంగా వచ్చి అదుపుతప్పి వెనుక నుంచి నారాయణను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి

జిన్నారం, న్యూస్‌టుడే: పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో చోటు చేసుకుంది. ఐడీఏ బొల్లారం పోలీసులు, పరిశ్రమ వర్గాల తెలిపిన వివరాలు.. సెల్‌మార్ ల్యాబరేటరీ పరిశ్రమలో పదిలం రాజేశ్ (31) ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం 6 గంటలకు మొదటి షిఫ్టులో విధులకు వచ్చిన ఆయన చిల్లింగ్ ప్లాంటు బ్రెయిన్ సంపులో పడి మృతి చెందాడు. ఆ సమయంలో ఎవరూ చూసి ఉండకపోవచ్చని చెబుతున్నారు. భద్రాచలం ప్రాంతంలోని కొత్తగూడెంకు చెందిన రాజేశ్ గత కొంతకాలంగా మేడ్చల్ జిల్లా సూరారంలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, చిన్న పాప ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఐడీఏ బొల్లారం సీఐ గంగాధర్ పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అనుమానాలు ఉన్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు.

నీతులు చెప్పాల్సిన నోటితో బూతులు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: పిల్లలకు నీతులు చెప్పాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఒకరు ఇటీవల బదిలీపై వచ్చారు. ఇక్కడ చేరినప్పటి నుంచి విద్యార్థులను మాటలతో హింసించడంతో పాటు మూత్రశాలలకు వెళ్లినా తిడుతున్నాడంటూ పలువురు తమ తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. బడికి రావాలంటే పిల్లలు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవో పుష్పవేణిలకు ఫోన్‌లో విషయాన్ని వివరించారు. ఎంఈవో పాఠశాలకు వచ్చి వారితో మాట్లాడి ఆరా తీశారు. వాస్తవమని తేలడంతో మరోసారి ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్‌ఎంను హెచ్చరించారు. ఇకనుంచి ఇబ్బందులు ఎదురైతే నా దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఒత్తిడి లేకుండా విధులు నిర్వహిస్తేనే ఆరోగ్యం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మామిడాల శ్రీనివాస్ సూచించారు. అప్పుడే అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని తెలిపారు. ఒత్తిడి అధిగమించడంపై సిద్దిపేట కమిషనరేట్‌లో అధికారులు, సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కమిషనరేట్ ఏవో యాదమ్మ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్‌గౌడ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలను మరింత ప్రోత్సహించాలి



మంత్రి తుమ్మలను కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి

ములుగు, న్యూస్‌టుడే: మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల సాగు వైపు రైతులు ఆసక్తి చూపేలా కార్యక్రమాలు అమలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా నూతనంగా నియమితులైన దండా రాజిరెడ్డి శనివారం రాత్రి హైదరాబాదులో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వీసీతో పలు అంశాలపై చర్చించారు.

ప్రమాదానికి గురైన కారు.. పట్టుబడిన గంజాయి

80 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఎండు గంజాయి బస్తాలు పరిశీలిస్తున్న పోలీసులు

రామాయంపేట, న్యూస్‌టుడే: ప్రమాదానికి గురైన కారులో భారీగా గంజాయిని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న కారు జాతీయ రహదారిపై రామాయంపేట శివారులోకి రాగానే అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న వారు కారును అక్కడే వదిలి పారిపోయారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు కారును గుర్తించి తనిఖీ చేయగా.. గంజాయి బస్తాలు బయటపడ్డాయి. ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి వచ్చి కారు డిక్కీలో ఉంచిన నాలుగు బస్తాల్లోని 80 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120-00	డ్రెస్డ్	206-00
రిటైల్	142-00	స్కిన్‌లెస్	234-00

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



లింగయ్య

గజ్వేల్ గ్రామీణ: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జగదేవపూర్ మండలం కొల్గూర్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. కొల్గూర్‌కు చెందిన బండారి లింగయ్య(55) గ్రామంలో పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం అతని భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపం చెంది.. జీవితంపై విరక్తితో శుక్రవారం అర్ధరాత్రి ఇంటి పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ మరొకరు..

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వేములఘాట్‌కు చెందిన కంటి ప్రభాకర్(22) ఆటో నడుపుతు జీవనం సాగించేవాడు. జల్సాలకు అలవాటుపడి ఆరు నెలల క్రితం ఆటో అమ్మేశాడు. మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. చనిపోతున్నట్లు ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్ పెట్టి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. వాట్సాప్ స్టేటస్ చూసిన కొందరు హుటాహుటిన ఇంటికి చేరుకొని గడియ పగలగొట్టి లోపలికి వెళ్లి కిందికి దించారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం ఆర్వీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చికిత్స పొందుతూ బావ బామ్మర్దులు మృతి

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో శుక్రవారం రాత్రి ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కూటిగల్ తండాకు చెందిన లావుడ్యా వాగ్యా(30), అతని బావ భూక్య రాజు(46) ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్‌లుగా బీఎస్ఎన్ఎల్‌లో పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్‌లో పనులు ముగించుకుని వాహనంలో ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ శివారులోని చేపలకాలనీ వద్ద పార్కింగ్ ఇండికేటర్స్ వేయకుండా, నిర్లక్ష్యంగా రోడ్డు మీద ఆపిన లారీని గమనించక వెనక నుంచి ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వాహనదారులు, పోలీసులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

లక్ష్మీపతిగూడెంలో పట్టపగలే చోరీ

జిన్నారం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని దుండగులు శనివారం పట్టపగలు లక్ష్మీపతిగూడెంకు చెందిన జనార్దన్ ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని నాలుగు తులాల బంగారం, ఆరు తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.40 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు వాపోయారు. జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీం ఆధారంగా విచారణ చేస్తున్నట్లు ఎస్సై నాగలక్ష్మి పేర్కొన్నారు.

'సైక్లింగ్'లో సిద్దిపేట జిల్లా క్రీడాకారుల సత్తా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా ఖేలో ఇండియా సైక్లింగ్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-18 బాలికల విభాగంలో టైమ్ ట్రయల్ 500 మీటర్ల అంశంలో కె.హర్షిత (హుస్నాబాద్-ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల) తృతీయ స్థానం, అండర్-16 బాలికల విభాగంలో రిజ్వానా బేగమ్ (సిద్దిపేట-ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల) నాలుగో స్థానంలో నిలిచారని జిల్లా సైక్లింగ్ అకాడమీ శిక్షకుడు సంజీవ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యువజన క్రీడల ఇన్‌ఛార్జి అధికారి జయదేవ ఆర్య, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనర్సయ్య తదితరులు క్రీడాకారులను అభినందించారు.

గురుకులంలో కాగ్నిజెంట్ శిక్షణ శిబిరం



అవగాహన కల్పిస్తున్న కాగ్నిజెంట్ డిప్యూటీ జీఎం శ్రీనివాస్ కుప్ప

వర్గల్, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కాగ్నిజెంట్ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్ కుప్ప పేర్కొన్నారు. శనివారం వర్గల్ మహాత్మ జ్యోతి బాపులే బీసీ డిగ్రీ మహిళా గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈనెల 23న తృతీయ సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు గచ్చిబౌలి కాగ్నిజెంట్ సంస్థను సందర్శించి అక్కడి నిర్వాహకులతో నైపుణ్య శిక్షణ పొందనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్ భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ గోవిందరావు, సంస్థ ప్రతినిధులు, విద్యాలయం ప్లేస్‌మెంట్ నిర్వాహకులు రాధ, నిఖిత పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల సందడి



సత్యనారాయణ స్వామి వ్రతపూజలో భక్తులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం చాకరిమెట్లలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చన చేపట్టారు. సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో సామూహిక వ్రతాలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్, ప్రధాన పూజారి దేవదత్త శర్మ తదితరులున్నారు.

ఉపాధితోనే వలసల నివారణ

న్యూస్‌టుడే, నారాయణఖేడ్



తల్లిదండ్రుల వెంట చిన్నారులు

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతం. ఇక్కడ 188 వరకు తండాలు ఉండగా, 50 వేలకు పైగా గిరిజనులు నివసిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా పరిశ్రమలు లేకపోవడం గమనార్హం. దీంతో యువత, ఇతర వర్గాల వారికి సరైన ఉపాధి దొరక్క వేరే ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. ఇక చెరకు నరికే సీజన్ వచ్చిందంటే చాలు.. ఈ ప్రాంతంలోని తండాలన్నీ ఖాళీ అవుతాయి. వృద్ధులు, చిన్నారులు మాత్రమే కనిపిస్తారు. చెరకు నరికేందుకు కుటుంబమంతా వలస వెళ్లడమే ఇందుకు కారణం.

పంటలు నష్టపోవడంతో..

ప్రతి ఏటా నవంబరులో చక్కెర కర్మాగారాలు తెరచుకుంటాయి. చెరకు చేతికొచ్చే సమయం కావడంతో ఈ పనికి నారాయణఖేడ్ ప్రాంతీయులంతా వెళ్తుంటారు. ఇందుకు చక్కెర కర్మాగారాలు, చెరకు తోటల యజమానుల నుంచి అడ్వాన్స్‌గా డబ్బు ముందుగానే తీసుకుంటుంటారు. గిరిజనుల్లో అత్యధికంగా వలసలతో పాటు వ్యవసాయం, కూలీ పనులపైనే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారు. ఇటీవలి భారీ వర్షాలతో 40 శాతానికి పైగా పంటలు నష్టపోయాయి. స్థానికంగా పనులు దొరికే అవకాశం అంతంతే. ఈ తరుణంలో బతుకుబండిని నడిపించేందుకు వలస బాట పట్టని పరిస్థితి నెలకొంది. దీంతో వలస వెళ్లే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

విద్యార్థులు సైతం..

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. గతేడాది సుమారు 3 వేల మందికి పైగా తల్లిదండ్రుల వెంట వలస వెళ్లారు. ప్రైవేటు పాఠశాలల్లో 1,500 మందికి 250 మంది వరకు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 300 మందికి 180 మంది వరకు వలస వెళ్లారు. చెరకు కోత సీజన్ ప్రారంభం నుంచి ముగిసే వరకు నాలుగు నెలల పాటు చదువుకు దూరమయ్యారు. ఈ సారి ఇదే పరిస్థితి ఎదురుకానుంది.

దృష్టిసారిస్తే..

తండాల్లోనే ఉపాధి హామీతో పాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసల నివారణ సాధ్యమవుతుంది. ఇందుకు ఇప్పటి నుంచే జిల్లా యంత్రాంగం ఉపక్రమించాల్సిన అవసరం ఉంది. ఏయే తండాల నుంచి ఎంతమంది వలస వెళ్లే అవకాశం ఉంది, నివారణకు ఏయే పనులు చేపట్టాలి, వెళ్లక తప్పని పరిస్థితులున్న కుటుంబాలు ఎన్ని తదితర విషయాలను సేకరించి కార్యాచరణ రూపొందించాలి. ఇక పిల్లలను వెంట తీసుకెళ్లకుండా చూపాల్సిన చొరవపై దృష్టిసారిస్తే కొంతవరకైనా మార్పు సాధ్యం.

యోగాలో బాలికలు అదుర్స్

న్యూస్‌టుడే, చేర్యాల



యోగాసనాల ప్రదర్శనలో చిన్నారులు

యోగా.. శారీరక, మానసికపర సమన్వయానికి ఏకైక సాధనం. ప్రస్తుతం పట్టణాల నుంచి పల్లెల వరకు, పిల్లల నుంచి వృద్ధుల వరకు నిత్యం సాధన చేస్తుండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా దీన్ని ప్రాధాన్యాన్ని గుర్తించగా, ఐక్యరాజ్య సమితి జూన్ 21న ప్రత్యేకంగా 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'ను నిర్వహిస్తున్న విషయం విదితమే. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో దీన్ని చేర్చడంతో పిల్లలు నేర్చుకునేందుకు ఆస్కారం ఏర్పడింది. ఈ క్రమంలో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం.సాత్విక, పి.అవంతిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం. వచ్చే నెల రెండో వారంలో అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత నిత్యం సాధన చేయించడంతో ఈ స్థాయికి చేరడం విశేషం.

ప్రయోజనాలు తెలియజేసి..:

ఎం.కవిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు




పాఠశాలలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీలతో పాటు యోగా సాధన చేయిస్తున్నాం. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించి పిల్లలను ప్రోత్సహిస్తున్నాం. ఎస్‌జీఎఫ్ యోగా పోటీల్లో పాఠశాల నుంచి ఇద్దరు అమ్మాయిలు జాతీయ స్థాయి ఎంపికవడం సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలోనూ పతకాలు సాధిస్తారన్న నమ్మకం ఉంది. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారు.

నిత్యం సాధనతో..



పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు నిత్యం సాధన చేయించారు. ఏ ఆసనం ఎలా వేయాలో నేర్పించారు. ప్రతి రోజూ ఇంట్లోనూ సాధన చేశాం. పోటీల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రోత్సహించారు. జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాం. **ఎం.సాత్విక, 8వ తరగతి**

ఇంటి వద్ద నేర్పిస్తూ..:



రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది. మేము నేర్చుకున్న ఆసనాలను ఇంటి వద్ద మా తల్లిదండ్రులకు, పక్కింటి వారికి సైతం నేర్పిస్తున్నాం. యోగాతో కలిగే ప్రయోజనాలు తెలియడంతో ఆసక్తి పెరిగింది. **పి.అవంతిక, 7వ తరగతి**

'మల్లన్న' సన్నిధిలో న్యాయమూర్తి పూజలు



స్వామివారిని దర్శించుకొని వస్తున్న సిద్దిపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కాంతారావు కుటుంబ సభ్యులు

చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి మల్లికార్జున స్వామిని సిద్దిపేట జిల్లా రెండో తరగతి(సెకండ్ క్లాస్) న్యాయమూర్తి కాంతారావు శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక బృందం ఆయనను సన్మానించి, ఆశీర్వచనం ఇచ్చారు.

జిల్లా క్రికెట్ జట్టులో చేర్యాల విద్యార్థి

చేర్యాల: ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల్లో భాగంగా చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న పట్టణానికి చెందిన కర్రోల్ల చరణ్ 19 ఏళ్లలోపు విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.జ్యోతి, అధ్యాపక బృందం అతన్ని అభినందిస్తూ సన్మానించారు.

ఆటలకు విరామం లేదిక!

- ఖాళీల భర్తీతో తీరిన పీఈటీల కొరత
- విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాల పెంపునకు దోహదం

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: ఇన్నాళ్లు ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు(పీఈటీ) లేక పిల్లలు ఆటలకు దూరమయ్యారు. క్రీడా ప్రాంగణాలున్నా ఆటలు ఆడించేవారు లేకపోవడంతో చిన్నారులు నిరుత్సాహానికి గురయ్యారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని భావించిన ప్రభుత్వం అందుకనుగుణంగా చర్యలు చేపట్టింది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, డీఎస్సీ-24 ద్వారా కొత్తగా ఎంపికైన పీఈటీలతో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఖాళీగా ఉన్న వ్యాయామోపాధ్యాయుల పోస్టులు భర్తీ అయ్యాయి. దీంతో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు మెరుగయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పీఈటీలు
హుస్నాబాద్	29	2323	2
అక్కన్నపేట	65	2314	7

గతంలో ఐదుగురు మాత్రమే ఉండేవారు

రెండు మండలాల్లోని 94 పాఠశాలల్లో మొత్తం 4,637 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవలి ఉపాధ్యాయుల బదిలీలకు ముందు ఈ మండలాల్లో ఐదుగురు పీఈటీలు మాత్రమే ఉండేవారు. మిగతా చోట్ల కొరత తీవ్రంగా ఉండేది. అవసరమైన మెలకువలు, శిక్షణనిచ్చే వారు లేక విద్యార్థులు ఆటల్లో వెనుకబడ్డారు. కొంతమంది ఉపాధ్యాయులే ఆయా పాఠశాలల్లో చొరవ తీసుకుని తమకు తెలిసిన క్రీడా నైపుణ్యాలను విద్యార్థులకు నేర్పించారు.

బదిలీలు, నియామకాలతో..

ఇటీవల నిర్వహించిన బదిలీల్లో మల్లంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు అదనంగా ఒక పీఈటీ వచ్చారు. తాజాగా డీఎస్సీలో కొత్తగా ఎంపికైన వారిలో అక్కన్నపేట మండలానికి ముగ్గురు పీఈటీలను కేటాయించారు. వారిలో రామవరం పాఠశాలకు పత్తిరవి, గోవర్ధనగిరి పాఠశాలకు బోయిని రమ, కట్కూర్ పాఠశాలకు పర్వతం విజయ్‌ను నియమించారు. ఈ మేరకు ముగ్గురూ విధుల్లో చేరారు. వీరితోపాటు అక్కన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న పీఈటీ పనిచేస్తున్నారు. దీంతో రెండు మండలాల్లోనూ పీఈటీ పోస్టులన్నీ భర్తీ అయ్యాయి.



మండలస్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

ఇబ్బందులు తొలగినట్లే: - జంగపల్లి వెంకటనర్సయ్య, పీఈటీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



గతంలో మండలానికి ఇద్దరు మాత్రమే పీఈటీలు ఉండేవారు. సరైన శిక్షణ లేక విద్యార్థులు ఆటల్లో వెనుకబడేవారు. దీంతో ఎస్జీఎఫ్ క్రీడల నిర్వహణకు ఇబ్బందిగా మారి, ప్రైవేటు పాఠశాలల పీఈటీలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు ఖాళీలు భర్తీ కావడంతో ఇబ్బందులు తొలగినట్లే. కొన్ని ఉన్నత పాఠశాలలకు పోస్టులు లేవు. వాటికీ మంజూరు చేయాలి.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



తాగునీటి సహాయకులకు పత్రాలు అందజేస్తున్న డీఈఈ రాజు, ఈఈ శ్రీనివాస్, తదితరులు

వర్గల్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ రాజు స్పష్టం చేశారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా సహాయకులకు వర్గల్ ఎంపీపీ సమావేశ మందిరంలో నాలుగు రోజుల శిక్షణ అనంతరం శనివారం మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఏఈ శ్రీధర్‌తో కలిసి సర్టిఫికెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం, నీటి సంరక్షణ, వృథా అరికట్టడం, రికార్డులు నిర్వహించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు.

హామీల అమలులో సర్కారు విఫలం: భాజపా



సభ్యత్వ నమోదులో పాల్గొన్న గంగాడి మోహన్‌రెడ్డి తదితరులు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట పట్టణంలో ఇంటింటా తిరుగుతూ శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ప్రతి బూత్ స్థాయిలో 200 మందితో సభ్యత్వ నమోదు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యాసాగర్, ఉపేందర్, నరేశ్, దినేష్, ప్రకాష్, పద్మ తదితరులు ఉన్నారు.

ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



గెలుపొందిన వారితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో సిద్దిపేట పరిధి రంగధాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగంతో కలిగే లాభ-నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా మొదటి మూడు స్థానాల్లో వరుసగా.. తొమ్మిదో తరగతికి చెందిన ఎస్.విజయ్‌కుమార్, వి.అక్షయ, 10వ తరగతికి చెందిన - పి.అభిషేక్ నిలిచారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సిద్దిపేట అర్బన్: విద్యుత్తు లైన్ల మార్పిడి కారణంగా సిద్దిపేట గ్రామీణ మండలం ఇర్కోడు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా పట్టణంలోని శ్రీనివాస్ నగర్, పటేల్‌పుర, సుభాష్‌రోడ్డు, సంజీవయ్యనగర్, తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు సరఫరా ఉండదని డీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం విద్యుత్తు సరఫరాలో 8 గంటల పాటు అంతరాయం కలగనున్నట్లు ఏస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. పట్టణంలో విద్యుత్తు స్తంభాల పనులు నిర్వహిస్తున్నందున సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి పందిల్లవాగు వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు, పురపాలికలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5-30 నుంచి 6.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు గమనించాలని కోరారు.

గజ్వేల్‌లో ప్రభుత్వ వైద్యం నిర్వీర్యం: వంటేరు



మహిళలతో మాట్లాడాతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, న్యూస్‌టుడే: కేసీఆర్ హయాంలో గజ్వేల్‌లో కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేస్తుందని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం గజ్వేల్‌లోని ఎంసీహెచ్ (మాతా శిశుసంరక్షణ కేంద్రం)ను సందర్శించి అక్కడ వైద్యసేవలు అందుకున్న తీరును మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గజ్వేల్‌లో వంద పడకల ఆసుపత్రితో పాటు రూ.33 కోట్ల ఖర్చుతో మాతా శిశుసంరక్షణ కేంద్రాన్ని నిర్మించి సకల సదుపాయాలు కల్పించిందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి, వైస్ ఛైర్మన్ జకీ, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, వరలక్ష్మి, చందు, అర్చన, భారాస పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా పాల్గొన్నారు.

'దుబ్బాక ఎమ్మెల్యే అసత్య ప్రచారాలు మానుకోవాలి'

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ. తొగుట మండలంలో కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ సర్పంచి సమక్షంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు కొనుగోలు కేంద్రాలను అడ్డుకుంటున్నారని అనడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు వారి సమస్యలను చెప్పుకోవడానికి ఎమ్మెల్యే దగ్గరకు వస్తే వారు కాంగ్రెస్ నాయకులు, దండలు వేస్తే భారాస నాయకులా అని ప్రశ్నించారు. దివంగత ముత్యంరెడ్డిపై మాట్లాడే హక్కు భారాస నాయకులకు లేదన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి, దుబ్బాక నియోజకవర్గంలో రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో 23 వేల రైతు కుటుంబాలకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొంగరి రవి, నరేందర్‌రెడ్డి, అనంతుల శ్రీనివాస్, ఏసురెడ్డి, కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్మకు పాల్పడిన ఘటన చిన్నకోడూరులో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు. . చిన్నకోడూరుకు చెందిన వేములవాడ రాజేశం(70) సెంట్రింగ్ మేస్త్రీ. అతనికి భార్య రాధ, కుమారులు యాదగిరి, చంద్రమౌళి ఉన్నారు. రాజేశం కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇదే విషయాన్ని తరచూ కుటుంబ సభ్యులకు చెబుతూ మనస్తాపానికి గురయ్యేవారు. శుక్రవారం రాత్రి భవనం పైగదిలో రాజేశం, రాధ పడుకున్నారు. శనివారం తెల్లవారుజామున రాధకు చలిగా అనిపించడంతో కింద ఉన్న మరో గదిలోకి వచ్చి పడుకుంది. రాజేశాన్ని ఉదయం నిద్ర లేపేందుకు రాధ, చంద్రమౌళి వెళ్లేసరికి లోపల నుంచి గడియపెట్టి ఉంది. కిటికీలోంచి చూడగా రాజేశం గది పైకప్పు ఇనుప రాడుకు తాడుతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వచేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మండల పరిధిలోని చిన్నఆరేపల్లిలో ఓ వ్యక్తి చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి తన కోళ్లఫారం వద్ద నిలువ చేశారనే సమాచారం అందింది. సిబ్బంది అక్కడికి వెళ్లి దాడులు నిర్వహించగా 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడగా.. స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేర్యాల(ధూల్మిట్ట), న్యూస్‌టుడే: ధూల్మిట్ట మండల కేంద్రంలో 14.6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. ధూల్మిట్టకు చెందిన పులి మల్లయ్య ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారంతో తనిఖీ చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ధూల్మిట్ట తహసీల్దారు మధుసూదన్ పంచనామా చేశారు. యాదాద్రి జిల్లా పుట్టగూడానికి చెందిన మాలోతు నగేశ్ ఈ బియ్యాన్ని ఆ ఇంట్లో నిల్వ ఉంచినట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

డీజిల్ దొంగకు రిమాండ్

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ అదనపు సీఐ ముత్యం రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాయపల్లికి చెందిన అంగోతి రాజ్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. హైదరాబాద్ నుంచి సెల్ఫ్ డ్రైవ్ కార్లు తీసుకొచ్చి గజ్వేల్, రాయపోల్, దౌల్తాబాద్, నర్సాపూర్, మేడ్చల్ ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల సమీపంలో పార్కింగ్ చేసిన లారీల నుంచి డీజిల్ దొంగతనం చేసి కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లిలో మహమ్మద్ షరీఫ్‌కు విక్రయించేవారు. శనివారం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజ్‌కుమార్ ఆటో తీసుకొని వస్తుండగా తమకు పట్టుబడ్డాడన్నారు. విచారించగా నేరాన్ని ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం రామవరం సమీపంలో ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. రామవరంలోని వైన్స్ సమీపంలోని కల్వర్టు వద్ద గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు ఒకవైపు కోతకు గురైంది. అప్పటి నుంచి దానికి మరమ్మతు చేయలేదు. ఇదిలా ఉండగా హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి హుస్నాబాద్‌కు వస్తోంది. రాత్రి రామవరం దాటిన తర్వాత కోతకు గురైన కల్వర్టు వద్ద బస్సు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. దీంతో వెంటనే బస్సును నిలిపివేశారు. ఆ సమయంలో బస్సులో 10మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు వారికి ఎలాంటి గాయాలు కాలేదు. తర్వాత బస్సును జేసీబీ సాయంతో బయటకు తీసినట్లు తెలిపారు.

ఆలయాలపై దాడులు అరికట్టాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ నేతలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దేవాలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ మెదక్ విభాగ్ సహ ప్రముఖ్ గ్యాదరి రాజారాం డిమాండ్ చేశారు. హిందూ ఆలయంపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కార్యాలయంలో అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెల రోజుల నుంచి హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వాపోయారు.

గ్రూపు-I అభ్యర్థులపై దాడి సరికాదు: వొడితల

హుస్నాబాద్, న్యూస్‌టుడే: గ్రూపు-1 పరీక్షలు వాయిదా వేయాలని హైదరాబాద్‌లో నిరసన తెలిపిన అభ్యర్థులపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు మాజీ శాసనసభ్యుడు వొడితల సతీశ్‌కుమార్ తెలిపారు. తక్షణమే అభ్యర్థుల డిమాండ్‌కు అనుగుణంగా పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత విధానాలతో విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే భారాస ఊరుకోదని, న్యాయం చేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు.

దుకాణాల్లో చోరీ

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడ మండలం నాగసముద్రాల స్టేజీ వద్ద ఉన్న ఉన్న రెండు కిరాణా దుకాణాల్లో చోరీ జరిగింది. బాధితులు ఆకుల మల్లయ్య, చామంతుల ఉప్పలయ్య కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి దుకాణాలు మూసి వారు ఇంటికి వెళ్లారు. ఉప్పలయ్య శనివారం ఉదయం దుకాణం వద్దకు రాగా, తలుపులు పగులగొట్టి ఉండడంతో పోలీసులకూ ఫిర్యాదు చేశారు. దుండగులు సీసీ కెమెరాలు సైతం చోరీ చేశారు. రూ.4 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై అభిలాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

దాబాలో 35 లీటర్ల మద్యం పట్టివేత

నంగునూరు, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా దాబాలో అక్రమంగా మద్యం నిల్వ చేసి సిట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రాజగోపాలపేట ఎస్సై ఎండీ ఆసీఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. ఖాతా గ్రామానికి చెందిన వేముల భాస్కర్, కొల్లూరి కరుణాకర్ ఇద్దరు కలిసి గ్రామంలోని పెద్దమ్మ ఆలయం సమీపంలో దుర్గా భవానీ దాబా నిర్వహిస్తున్నారు. అందులో అక్రమంగా మద్యం నిల్వచేసి సిట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించగా రూ.39,374 విలువ చేసే 35 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూదరుల నుంచి నగదు, చరవాణులు స్వాధీనం

నంగునూరు, న్యూస్‌టుడే: బద్దిపడగ శివారులో జూద స్థావరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. గ్రామశివారులో కొంత మంది వ్యక్తులు కలిసి జూదం ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, రాజగోపాలపేట పోలీసులు ఆకస్మికంగా దాడిచేయగా సిద్దన్నపేట, మగ్దుంపూర్ గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు తప్పించుకోగా.. సిద్దన్నపేట, నంగునూరు, ఇర్కోడు, మగ్దుంపూర్ గ్రామాలకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి 6 ద్విచక్రవాహనాలు, 4 ఫోన్లు, రూ.24,480 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రాజగోపాలపేట ఎస్ఐ ఎండీ ఆసీఫ్ తెలిపారు.

కోహెడ గ్రామీణం: కోహెడ మండలంలోని నకిరేకొమ్ముల శివారులో జూదమాడుతూ పట్టుబడిన పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. శనివారం నమ్మదగిన సమాచారంతో వెళ్లి జూదరులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సమీకృత విపణి సందర్శన.. విక్రేతలకు సూచన

సిద్దిపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని సమీకృత విపణిని బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాంసం విక్రేతలకు పలు సూచనలు చేశారు. బల్దియా ఆధ్వర్యంలో అందుబాటులోకి తెచ్చిన స్లాటర్ హౌస్‌కు మేకలు, గొర్రెలు తరలించాలన్నారు. వైద్యుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలు సూచించేలా ముద్ర వేస్తారని, ఆ తర్వాతే విక్రయించాలన్నారు. పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత తదితరులు ఉన్నారు.

'కృపాభవన్'కు వాహనం అందజేత



వాహనాన్ని అందజేస్తున్న జోయాలుక్కాస్ సంస్థ ప్రతినిధులు

బెజ్జంకి, న్యూస్‌టుడే: అనాథ పిల్లలకు ప్రయాణ సౌలభ్యానికి వీలుగా ప్రముఖ బంగారు ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ సంస్థ టాటా ఈకో కారును విరాళంగా అందజేసి ఉదారతను చాటుకుంది. బెజ్జంకి క్రాసింగ్‌లోని అనాథ పిల్లల నిలయమైన 'కృపాభవన్'కు శనివారం సంస్థ తెలంగాణ రీజనల్ మేనేజర్ ఆంటో థామస్ సంస్థ ప్రతినిధులతో కలిసి నిర్వాహకులకు వాహనాన్ని అందజేశారు.

గీత కార్మికుడికి గాయాలు

చేర్యాల(ధూల్మిట్ట): ధూల్మిట్ట మండలం కూటిగల్‌కు చెందిన పొన్నం వెంకటయ్య ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గాయాల పాలయ్యాడు. కల్లుతీత వృత్తిలో భాగంగా శనివారం తాటిచెట్టు ఎక్కిన ఆయన ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. ప్రమాదంలో కుడికాలు రెండు చోట్ల విరిగింది. నడుము భాగంలో తీవ్రగాయమైందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై సిద్దిపేట గ్రామీణ ఠాణాలో శనివారం కేసు నమోదయింది. ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట గ్రామీణ మండలం మాచాపూర్‌కు చెందిన గణేశ్ సుతారి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 17న ఉదయం పనికోసం సిద్దిపేటకు వెళుతున్నానని చెప్పి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అతడి భార్య జ్యోతి సాయంత్రం ఫోన్ చేసి ఎక్కడున్నావని అడగ్గా వస్తానని సమాధానం చెప్పాడు. రాత్రి 9 గంటలైనా గణేశ్ ఇంటికి రాకపోవడంతో మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. జ్యోతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుభరోసా ఇవ్వకపోవడం సరికాదు: భారాస



గజ్వేల్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న భారాస శ్రేణులు

గజ్వేల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకి అని గజ్వేల్ ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీ ఫోరం మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవి రవీందర్ అన్నారు. వానాకాలం సీజన్‌లో రైతుభరోసా సాధ్యం కాదని మంత్రి తుమ్మల చెప్పటం చూస్తే ప్రభుత్వం తప్పించుకుంటుందని ఆరోపిస్తూ శనివారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ కూడలి వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రైతులకు సమాధానం చెప్పాలన్నారు. ప్యాక్స్ ఛైర్మన్ వెంకటేశం, మాజీ జడ్పీటీసీ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే విస్మరించిందని భారాస రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలశాఖ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. చిన్నకోడూరులో భారాస నాయకులు రైతులతో కలిసి నిరసన తెలిపి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.